# దేహాభిమానం బలిచేస్తే మనకు ఆత్మనిష్ఠకలిగి, మన ద్వారా లోకానికి మేలు జరుగుతుంది

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-2-2001, గణపవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మహాత్ములను, మహర్షులను దర్శించటం వలన జ్ఞానం యొక్క విలువ నీకు తెలుస్తుంది, జ్ఞానం పొందాలనే కాంక్ష హృదయాంతరాళములనుండి వస్తుంది. నీకు ఆత్మనిష్ఠ కలిగితే నీద్వారా లోకానికి మేలు జరుగుతుంది, నీద్వారా అనేకమంది చైతన్యస్థాయిని పెంచుకొంటారు. చైతన్యానుభవం పొందటంకోసం, ఆత్మానుభవం పొందటంకోసం నీ దేహాభిమానాన్ని బలిచేయవలసిందే, ఆత్మానుభవం కావాలనుకొన్నప్పుడు దేహాభిమానాన్ని కాదని అనవలసిందే, అదీ కావాలి, ఇదీ కావాలి అంటే సాధ్యం కాదు. నీ దేహాభిమానాన్ని త్యాగం చేయలేవు అనుకో ఆత్మానుభవం నీకు అందదు, ఎంతసమీపంగా ఉన్నా అది నీకు అందదు. మహాత్ములను దర్శించటం వలన హృదయంయొక్క లోతులు పెరుగుతాయి. హృదయం యొక్క లోయలలోనికి వెళ్ళేకొలది ఆత్మముత్యం నీకు దొరుకుతుంది. అప్పుడు రాకపోకలతో నీకు పనిలేదు. ఆత్మ అంతటా ఉంది కాబట్టి నీవు కూడా విశాలమైపోతావు, ఆకాశం ఎంత విశాలంగా ఉందో అంత విశాలమయిపోతావు. నిప్ప దగ్గరకు వెళ్ళేకొలది వేడి ఎలా తెలుస్తూ ఉంటుందో అలాగ ఆత్మవైపుకు వెళ్ళేకొలది దానితాలుక సుఖం, శాంతి, ఆనందం మనకు తెలుస్తూ ఉంటుంది. గుడిలో దేవుడిని చూడటం ఎందుకంటే, అలా చూడగా చూడగా లోకం అంతా దేవుడిని చూసే అవకాశం వస్తుంది. లోకంఅంతా దేవుడిని చూస్తూ ఉంటే నీకు మోహం ఎక్కడుంది. మోహం ఉన్నవాడికి కోరికలు గాని మోహంలేనివాడికి కోరికలు లేవు. లోకం అంతా దేవుడిగా చూసినప్పుడు మనకు ద్వైతబుద్ధి నశిస్తుంది. ద్వైతబుద్ధి నశించిన మరుక్షణంలో అద్వైతానందం నీకు కలుగుతుంది, అప్పుడు ఇంక నీకు పునర్జన్మలు లేవు.

మనస్సు బయటకు వస్తే అశాంతి, లోపలకు వెళితే శాంతి. దానిని ఎటుపంపాలి అనేది నీ చేతిలో ఉంది. మనస్సు బయటకు వస్తే ఎలాగ ఉంటుంది అని అడుగుతున్నారు. మనస్సు బయటకు వస్తే లోకంలోని విషయములతో తాదాత్మ్యం పొందుతుంది, నీవు ఏదైతే కాదో దానితో తాదాత్మ్యం పొందుతుంది, పూర్వం నీకు ఉన్న అలవాట్లయొక్క వేగంలో కలిసిపోతుంది. బయటకు వెళ్ళే మనస్సుకు జ్ఞానం రాదు. అంతర్ముఖమైన మనస్సుకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం లేకుండా హృదయంలో ఉన్న సద్వస్తువు నీకు అందదు. ప్రపంచంలో ఏ వస్తువులోను శాంతిలేదు. శాంతి నీ హృదయంలోనే ఉంది. నీవు ఇంట్లో ఉన్నా, గుడిలో కూర్చొన్నా, సమాజంలో ఉన్నా నీ శరీరం ఎక్కడ ఉంది

అనేది ప్రధానం కాదు, నీ మనస్సు ఈశ్వరుడి స్థానమైన హృదయం వైపుకు ఎంతవరకు జరుగుతోందో అది చూసుకోవాలి. మందు మ్రింగటం వలన నీ జ్వరం ఎంతవరకు తగ్గుతోందో చూసుకోవాలి. నాకు జ్వరం తగ్గకపోయినా ఫరవాలేదు మందులు మ్రింగుతాను అంటే ఆ మాటకు అర్ధంలేదు. లోకజ్వరం, మోహజ్వరం తగ్గటానికి మనస్సును హృదయంలోనికి పంపవలసిందే. దేహానికి సంబంధించిన అనుబంధం కాదు, గురువుతో మానసికఅనుబంధం ఉండాలి. అప్పుడు గురువు నిన్ను పరమ పవిత్రుడిని చేస్తాడు. నీకు విశ్రాంతి కావాలంటే నీ మనస్సును హృదయంలో నిలబెట్టినప్పుడు మాత్రమే నీకు నిజమైన విశ్రాంతి కలుగుతుంది. అభ్యాసం ఎంతకాలం చేయాలి, ధ్యానం ఎంతకాలం చేయాలి అని అడుగుతున్నారు. మీరు రోజూ వంట చేసుకొంటున్నారు, అన్నం తింటున్నారు. ఇలా ఎంతకాలం తినమంటారు అని ఎవరైనా అడుగుతున్నారా? లేదు. అభ్యాసం ఎంతకాలం చేయాలి అని అడుగుతున్నారు. అన్నం తినమని ఎవరూ నీకు చెప్పనక్కరలేదు. అభ్యాసం చేసుకోండి అని నీకు ఎవరో చెప్పాలా? ఎవరో చెపితే చేసింది ఎంతకాలం నిలబడుతుంది. రోజూ అన్నం ఎలాగ తింటున్నావో, స్నానం ఎలా చేస్తున్నావో అంత సహజంగా నీ మనస్సును హృదయంలో నిలబెట్టే అభ్యాసం చేయాలి. అది కృత్రిమంగాకాదు, సహజంగా చేయాలి. ఏ వస్తువును అయితే పొందుదామని అనుకొంటున్నావో ఆ వస్తువును సహజంగా ప్రేమించే కొలది ఆ వస్తువు నీకు వేరుగా కాదు, నేనుగానే నీకు వ్యక్తమవుతుంది. రోడ్డు ప్రక్కన ఉన్న మురికిగుంటలకంటే నీ మనస్సులో ఉన్న మురికిగుంటలు ప్రమాదకరమైనవి. వాటివలన నీ శరీరానికి అనారోగ్యం రావచ్చుకాని మనస్సులోఉన్న మురికిగుంటలవలన నీవు నీచాతి నీచమైన జన్మలలోనికి వెళ్ళవలసి ఉంటుంది. నీ మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచటం వలన మనస్సులో ఉన్న మురికిగుంటలు నీకు తెలియకుండానే రాలిపోతాయి. అప్పుడు నీ మనస్సు నిర్మలమవుతుంది, నీ మనస్సు శుద్ధి అవుతుంది. నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా, ఏగురువును ఆశ్రయించినా అంతఃకరణ శుద్ధి అవ్వకుండా నీవు మోక్షసామ్రాజ్యానికి అధిపతివి అవ్వలేవు.

మాకు చాలా డబ్బు ఉంది, గౌరవం ఉంది. మనస్సుకు శాంతిలేకపోతే ఏమౌతుంది అనేవారు ఎవరైనా ఉన్నారా? ఎవరూ లేరు. అందరికీ శాంతి కావాలి. నీ హృదయంలో ఉన్నశాంతితో సమానమైనది ఈ సృష్టిలో ఏదీలేదు. మనస్సును హృదయంలో ఎక్కువగా ఉంచటంవలన, దానికి సాధనాబలం పెరుగుతూ ఉంటే ఆత్మానుబలం కలగటానికి ఏ విషయాలయితే నీకు ఆటంకంగా ఉన్నాయో ఏ విషయాలయితే నిన్ను ఇబ్బంది పెడుతున్నాయో వాటికి శక్తి తగ్గిపోతుంది, అలవాట్లయొక్క వేగం తగ్గిపోతుంది. వాటి వేగం తగ్గిపోయిన తరువాత అవి నెమ్మదిగా రాలిపోతాయి. ఇది మొదట కష్టంగా అనిపించినా అభ్యాసం చేసే

కొలది అవి పోతాయి. నీ చివరిశ్వాసవరకు అభ్యాసము, వైరాగ్యములను విడిచిపెట్టవద్దు అని భగవంతుడు చెప్పాడు. వైరాగ్యం మనస్సును బాహ్యముఖానికి వెళ్ళకుండా ఆపుచేస్తుంది. అభ్యాసం వలన మనస్సు హృదయంలో నిలబడి ఉంటుంది. ఏ జన్మలో అయినా నీ హృదయం ఖాళీ అవ్వకుండా ఎవరికీ ఆత్మజ్ఞానం కలుగదు. దానిని ఖాళీ చేసుకోవటం గదిని ఖాళీచేసినంత తేలికకాదు. ఈశ్వరానుగ్రహం లేకుండా హృదయం ఖాళీ అవ్వదు. ఆత్మయొక్క వైభవం, ఆత్మయొక్క సౌందర్యం జీవుడికి ఏమి తెలుస్తుంది. సూర్యుడు ఉదయించాక చీకటి పోతుంది, అది ఉండాలన్నా ఉండలేదు. అలాగే ఆత్మయొక్క వెలుగులో ఆ మహావెలుగులో భ్రమ అనే చీకటి, మోహమనే చీకటి పూర్తిగా కరిగిపోతుంది, ఉండాలన్నా అది ఉండలేదు.

వాసనలు పూర్తిగా వేరుతో సహా నశించాక వస్తువు నీకు ప్రత్యక్షంగా అనుభవంలోనికి వస్తుంది. వస్తువు అనుభవంలోనికి వచ్చాక నమ్మకాలతో పనిలేదు. ఎందుచేతనంటే అది ప్రత్యక్షానుభవం. వాసనలు పూర్తిగా నశించకపోతే హృదయంలోఉన్న వస్తువు నీకు కొంత తెలుస్తూ ఉంటుంది అనుకో అప్పుడు నీకు అనుభూతి కలుగదు. పూర్తిగా వాసనా నాశనం అయిన తరువాత అరచేతిలో ఉన్న వస్తువు నీకు ఎంత స్పష్టంగా గోచరిస్తుందో నీ హృదయంలో ఉన్న వస్తువు అంత స్పష్టంగా నీకు గోచరిస్తుంది. వాసన మూలంతో సహా నశించేవరకూ నీకు జ్ఞానం స్థిరపడదు. కొద్దిగా శేషం ఉన్నా లాభం లేదు వాసనలు నిశ్శేషంగా నశించాలి. దీనికి సహనం, పట్టుదల ఉండాలి. గది తుడిస్తే గదిపోదు గదిలో ఉన్న దుమ్ము పోతుంది. నీవు సాధన చేస్తూ ఉంటే నీవు ఎక్కడికి వెళ్ళవు, నీవు ఏదైతే కాదో అది పోతుంది, నీవు ఏదిగా ఉన్నావో అది మిగులుతుంది. ఆత్మను వెతుకుచున్నాను, ఆత్మ నాకు ఇంకా దొరకలేదు అని ఒక భక్తుడు భగవాన్‌తో అన్నాడు. అసలు అది ఎప్పుడైనా పోతేకదా నీవు వెతుక్కోవటానికి. ఉన్న వస్తువును ఎవరూ వెతుక్కోరు. నిజంగా అది పోలేదు నీ తలంపులో పోయింది. అది పోయిందనే తలంపును పోగొట్టుకో ఉన్నది ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది, నీవు ఆత్మగా మిగిలిపోతావు అన్నారు భగవాన్. నీవు సాధన చేస్తూ ఉంటే సాధనాబలం వలన, ఈశ్వరానుగ్రహం వలన వాసనలు నెమ్మదిగా పోతాయి. మీరు ప్రయత్నం మానకండి. రోజూ సాధనచేయటమే పనా అని అడుగుతున్నారు. సత్యాన్వేషణలో ఉన్నప్పుడు నీవు సాధన చేయకుండా ఉండలేవు. కొంతదూరం వెళ్ళాక నీవు సాధన చేద్దామన్నా చేసేవాడు అక్కడ ఉండడు. అప్పుడు నేను సాధన చేయమన్నా నీవు సాధన చేయలేవు ఎందుచేతనంటే చేసేవాడు అక్కడ ఉండడు. నిర్మలంగా సాధన చేసుకొంటూ వెళ్ళిపోండి. తొందరపడవద్దు, సాధనవిడిచిపెట్టవద్దు. మీ సాధనా ఫలితం మీకు ఇచ్చేస్తాడు, ఆయనకు అక్కరలేదు. భగవంతుడు కర్మఫల దాత.